కడా.. కాల్వల్ని కనికరించమ్మా!

- మేటవేసిన తూడు, గుర్రపుడెక్క
- శివారు ప్రాంతాలకు నీటి కటకట
- ఆదుకోవాలని రైతులు, గ్రామ ప్రజల మొర

ఆకివీడు: పశ్చిమ డెల్టాలో పంట, మురుగు కాల్వల్లో తూడు, గుర్రపుడెక్క పేరుకు పోయాయి. ప్రతీ ఏటా వేసవిలో ఓ అండ్ ఎం నిధులు విడుదలతో కాల్వల్లో పనులు ప్రారంభించి, పంట కాల్వల్లోకి నీరు వదిలే సమయానికి పనుల్ని ముగిస్తారు. ఖరీఫ్ సీజన్‌కు ముందు గత ఏడాది, రబీ సీజన్ లోనూ ఆయా పంట కాల్వల్లో తూడు తొలగింపు పనులు చేపట్టారు. కాలువల్లో తూతూ మంత్రంగా పనులు చేపట్టడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా తూడు, గుర్రపుడెక్క, కర్ర నాచు వంటి గడ్డిజాతి మొక్కలు పంట కాల్వల్లో విపరీతంగా పెరిగిపోతున్నాయి. వీటిని యంత్రణ బాధ్యతను సక్రమంగా నిర్వహించకపోడంతో నీటి ప్రవాహానికి తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. పంట కాల్వల్లోకి సాగు నీటిని విడుదల చేసినప్పటికీ శివారు ప్రాంతాలకు, గ్రామాల్లోని పలు ప్రాంతాల ఆయుకట్టుకు సకాలంలో నీరు సరఫరా కావడం లేదు. దీంతో పంట భూముల్లో సాగు ఆలస్యమవుతోంది. సాగు జరుగుతున్న సమయంలో కూడా నీరు అంతంత మాత్రంగానే సరఫరా కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందుల్ని ఎదుర్కొని, ఆయిల్ ఇంజన్ల ద్వారా నీటిని తోడుకోవలసి వస్తుంది. కాలువల మెయింటినెన్స్ పనుల్ని సకాలంలో చేపట్టడం లేదు. దీంతో నీటి పారుదల వ్యవస్థకే మాయని మచ్చ ఏర్పడుతోంది.


స్థానిక వెంకయ్య వయ్యేరు పంటకాల్వలో మేట వేసిన మట్టి, గుర్రపుడెక్క

డివిజన్‌లో రూ. 5 కోట్ల మేర ప్రతిపాదనలు

నీటి పారుదల శాఖ భీమవరం డివిజన్ పరిధిలో వివిధ పంట కాల్వల్లో తూడు, గుర్రపుడెక్క, కర్ర నాచు, కాల్వల గట్లు పటిష్ట పరిచేందుకు, ఇతరత్రా మైనర్, మేజర్ పనులు చేపట్టేందుకు ఆ శాఖ అధికారులు ఎస్టిమేట్లు వేసి కడాకు పంపినప్పటికీ అనుమతులు రాకపోవడంతో పనులు చేపట్టడంలో జాప్యం జరుగుతుంది. వర్షాకాలం వచ్చే సరికి పనులకు అనుమతులు ఇవ్వడంతో సంబంధిత కాంట్రాక్టర్లు తూడు, గుర్రపుడెక్కను నీటి ప్రవాహంలో కొట్టుకు పేయే విధంగాతూతూ మంత్రంగా చర్యలు చేపట్టి, బిల్లులు కాజేస్తున్నారని రైతులు వాపోతున్నారు. సకాలంలో పనులు చేపట్టి రైతుల్ని ఆదుకోవాలని, పంటల వృద్ధికి సహకరించాలని కోరుతున్నారు.

ఉపాధి హామీలో చేపట్టాలి

తూడు, గుర్రపుడెక్క, కర్రనాచు వంటివి విపరీతంగా పేరుకుపోయిన పంట కాల్వల్లో తక్షణం ఉపాధి హామీ పనులు చేపట్టే విధంగా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ప్రధాన పంట కాల్వలైన వెంకయ్య వయ్యేరు, ఓల్డ్ వయ్యేరు, ఉండి పంట కాల్వలతో పాటు పాలకోడేరు మండలంలోని రేలంగి ఛానల్, జీఎన్వీ కెనాల్, యనమదుర్రు కాల్వలతో పాటు డివిజన్‌లోని పలు పంట కాల్వలో గుర్రపుడెక్క, తూడు, కర్రనాచు పేరుకుపోయిన వాటిని తొలగించేందుకు ఉపాధి హామీ పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

సకాలంలో స్పందించని 'కడా'

ఆకివీడు: సాగునీటి వ్యవస్థను మెరుగుపరచేందుకు ఏర్పాటు చేసిన కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(కడా) సంస్థ సకాలంలో స్పందించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పశ్చిమ డెల్టా ప్రాంతంలోని పంట, మురుగు కాల్వల్లో తూడు, గుర్రపుడెక్క తొలగింపు, కాల్వ గట్లు పటిష్ట పరుచుట, షట్టర్లు బాగు చేయడం, కొత్తవి ఏర్పాటు చేయడం తదితర పనులకు సంబంధిత శాఖల అధికారులు ఎస్టిమేట్లు వేసి ప్రతిపాదనలను కడాకు పంపుతారు. ఈ ఏడాది కడా నుంచి ఏ విధమైన అనుమతులు రాకపోవడంతో పంట కాల్వల్లో తూడు, గుర్రపుడెక్క తిష్టవేశాయి. వర్షాలు కురిసినా, పంట కాల్వల్లోకి నీరు వదిలినా ఇవి వేగంగా పెరిగి నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం కల్గిస్తాయి. నీటి వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కడాను ఏర్పాటు చేశారు. దేశంలో వ్యవసాయ ఉత్పత్తుల్ని పెంచడం కోసం భారీ, మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టులపై ఏకీకృత, సమగ్ర అభివృద్ధి కోసం కడాను కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. నీటి పారుదల సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకునే విధంగా కడా త్వరిత గతిని స్పందించాల్సి ఉందని పలువురు రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఘనంగా చండీహోమం


మావుళ్లమ్మ ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానఅర్చకులు మల్లికార్జునశర్మ, వేదపండితులు ఆధ్వర్యంలో ఈ హోమాన్ని వైభవంగా నిర్వహించారు. 76 మంది దంపతులు ఈ హోమంలో పాల్గొన్నారని దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం


నిత్యాన్నదానానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో గునుపూడిలో పంచారామ క్షేత్రం శ్రీ సోమేశ్వర జనార్ధన స్వామి వార్ల నిత్య అన్నదానం ట్రస్టుకు సాగి అచ్యుత రామరాజు జ్ఞాపకార్థం కుమారుడు సాగి విఠల్ రంగరాజు రూ.లక్షలను శాశ్వత అన్నదానం నిమిత్తం విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా గ్రామోత్సవం


గుమ్ములూరులో సాయిబాబా పవిత్రోత్సవాల్లో భాగంగా గ్రామోత్సవం చేస్తున్న దృశ్యం

ఆకివీడు: స్థానిక గుమ్ములూరు సెంటర్‌లోని సాయిబాబా మందిరం 22వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణం నుంచి సాయి నామ సంకీర్తనలతో ఊరేగింపు జరిగింది. ఆయా ప్రాంతాల్లో మహిళలు సాయిబాబాకు ప్రత్యేక హారతులిచ్చారు. ఈ నెల 24వ తేదీన సాయి కోటీశ్వర్ 100 అడుగుల మహాస్థూపం 16వ వార్షికోత్సవం సందర్భంగా ఐదు కోట్ల సాయినామములు కలిగిన పుస్తకములతో బాబా వారి ఊరేగింపు నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఎంపీటీసీని పరామర్శించిన శాసన మండలి చైర్మన్


దిరుసుమర్రులో ఎంపీటీసీ పరామర్శిస్తున్న శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

భీమవరం అర్బన్: మండలంలోని దిరుసుమర్రు గ్రామంలో పెరాలసిస్‌తో బాధపడుతున్న ఎంపీటీసీ తేలి జోషఫ్ రవికుమార్‌ను గురువారం ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు పరామర్శించారు. జోషఫ్ రవి కుమార్ ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పుడూ వాకింగ్ చేయాలని, వేళకు తప్పనిసరిగా మెడిసిన్ వేసుకుని విశ్రాంతి తీసుకోవాలని పలు ఆరోగ్య సూచనలను చేశారు. మేమంతా అండగా ఉన్నామని అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు ఉన్నారు.

లక్ష్మీపాలెంలో ముగిసిన అమ్మవార్ల జాతర

యలమంచిలి: లక్ష్మీపాలెం గ్రామ దేవతలు మారెమ్మ, పుంతల ముసలమ్మ, కనకదుర్గమ్మ వార్ల జాతర మంగళవారం, బుధవారం రాత్రి రెండు రోజులు ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, ఆశాదుల గరగలు నృత్యాలు, కాళికా దేవి వేషాల మధ్య అమ్మవార్ల జాతర నిర్వహించారు. జాతర అనంతరం అమ్మవార్లను ఆలయ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా అమ్మవార్ల ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. అమ్మవార్లకు గురువారం నైవేద్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకోవడంతో ఉత్సవాలు ముగిశాయి.

ఘనంగా సాయి సత్యవ్రతం

యలమంచిలి: మండలంలోని అడవిపాలెం గ్రామంలోని సాయి విఠల్ మందిర్ 21వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కొండవీటి సూర్యనారాయణశర్మ బ్రహ్మత్వంలో ఉదయం బాబాకు కాగడ హారతి, సుప్రభాత సేవ, అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం సాయి సేవక్ చుండూరి నాగేశ్వరి ఆధ్వర్యంలో సాయి సత్య వ్రతం, విరాట్ సాయి స్తోత్ర పఠనం, చందనోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో సాయి సత్య వ్రతాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

దొడ్డనపూడిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం


దొడ్డనపూడిలో చిన్నారులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

కాళ్ల: ప్రతి ఒక్కరు ప్రభుత్వం అందించే వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కాళ్ల ప్రభుత్వాసుపత్రి వైద్యులు ఎస్. సునీల్, భావన తెలియజేశారు. కాళ్ల మండలం దొడ్డనపూడి గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆర్.బి.ఎస్.కె ప్రోగ్రాం అధికారి భావన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి ఐదు సంవత్సరాలలోపు పిల్లలపై తీసుకుంటున్న జాగ్రత్తలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలు ఎవరైనా జన్యూ లోపంతో ఇబ్బంది పడుతుంటే వారికి ప్రభుత్వం ఖర్చుతో వైద్య సేవలను తణుకులో అందిస్తున్నట్లు స్పష్టం చేస్తారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుని బోధనలు పాటించాలి

భీమవరం: బుద్ధుని బోధనలను ప్రపంచం యావత్తూ పాటించాల్సిన అవసరముందని బుద్ధుని బోధనలు గత కాలపు అవశేషాలు కాదని ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ. వీరయ్య అన్నారు. గురువారం బుద్ధ పౌర్ణమి సందర్భంగా ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరం అంబేద్కర్ భవన్-విజ్ఞాన సాంస్కృతిక వికాస కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గౌతమ బుద్ధుని శాంతి, సామరస్యం, సహజీవన సందేశం, ప్రపంచాన్ని బెదిరించే ద్వేషం, భయాందోళన శక్తులకు వ్యతిరేకంగా నిలుస్తుందన్నారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు యేలేటి న్యూటన్ మాట్లాడుతూ బుద్ధుని బోధనలు పాటిస్తే ఎలాంటి హింసకు తావు లేకుండా నైతిక విలువలతో కూడిన సమాజం ఏర్పడుతుందన్నారు. ముందుగా బుద్ధుని విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎన్ విజయకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి రాజ బాబు, కోశాధికారి ఎంవిఎస్ ప్రసాద్, ఎన్ రాజేందర్, పి అమూల్యారావు, ఎం రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


భీమవరంలో బుద్ధుని విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

భీమవరం: దళిత క్రైస్తవులను ఎస్సీ హోదా కావాలని మాల మహానాడు ఆధ్వర్యంలో చేసిన పోరాటాలు ఫలితంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన తీర్మాణాన్ని కేంద్రం ప్రభుత్వం కూడా ఆమోదించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. గురువారం పట్టణంలోని మెంటేవారి తోటలో పాస్టర్ నేతల జ్ఞానప్రకాష్ ఏర్పాటు చేసిన యేసుక్రీస్తు రక్షణ సువార్త మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో ఆమోదం పొందేవరకూ పోరాటం చేస్తామని దళిత క్రైస్తవులపైనా చర్చిలపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించేలా చట్టాలు తీసుకురావాలన్నారు. క్రైస్తవులకు ఎల్లప్పుడు మాల మహానాడు అండగా ఉంటుందని పుష్పరాజ్ స్పష్టం చేశారు. అనంతరం పేదలకు జ్ఞానప్రకాష్ సమకూర్చిన చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ ఏడివి ప్రసాద్, ఉచ్చుల రమేష్, నేతల రమేష్‌బాబు, సురేష్‌బాబు, రాజేష్, మాల మహానాడు జిల్లా కార్యదర్శి చిల్లె రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



యేసుక్రీస్తు రక్షణ సువార్త మహాసభలో మాట్లాడుతున్న పుష్పరాజ్

టీడీపీ వల్లే పించన్ల ఇబ్బందులు

పాలకొల్లు అర్బన్: వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు వలంటీర్ల ద్వారా పింఛన్లు ఇవ్వకుండా తెలుగుదేశం నాయకులు అడ్డుపడ్డారని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ మండిపడ్డారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాలకొల్లులో ఒక వృద్ధుడికి పింఛన్ అందలేదని ఎమ్మెల్యే నిమ్మల ఆ వృద్ధుడ్ని కారులో ఎక్కించుకుని బ్యాంక్‌కి తీసుకువెళ్లి వృద్ధులను బాధపెట్టడం సరికాదంటూ బ్యాంక్ అధికారులను నిలదీయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పింఛన్లు అందకపోవడానికి ప్రధాన కారణం తెలుగుదేశం పార్టీయేనన్నారు. అపాలకొల్లులో దమ్మయ్యపత్తి డ్రైయిన్ పనులు నిలిచిపోవడానికి ఎమ్మెల్యే నిమ్మలే కారణమన్నారు. దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖరరెడ్డి దమ్మయ్యపత్తి డ్రైయిన్ పనుల మరమ్మతులకు రూ.8కోట్లు నిధులు విడుదల చేశారని, మాజీ ఎమ్మెల్యే ఉషారాణి హయాంలో రూ.4కోట్లు పనులు పూర్తయితే, మిగిలిన రూ.4కోట్లు పనులు పూర్తి చేయడానికి పృథ్వీరాజ్ అనే కాంట్రాక్టర్ ముందుకు వస్తే 20శాతం కమిషన్ల కోసం పనులు అడ్డుకున్న ఘనుడు ఎమ్మెల్యే నిమ్మలని యడ్ల తాతాజీ దుయ్యబట్టారు. మేడపాడులో పేదలకు ఇచ్చిన 40 ఎకరాల ఇంటిస్థలాలు పూడిక నిమిత్తం చించినాడ నుంచి మట్టి తరలిస్తుంటే ఎమ్మెల్యే నిమ్మల లారీలకు అడ్డంగా పడుకుని పూడిక పనులు నిలిచిపోవడానికి కారణమయ్యారని విమర్శించారు. 100 పడకలతో ప్రభుత్వాసుపత్రిని సుమారు రూ.13కోట్లతో పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తే అధికారులను బ్లాక్ మెయిల్ చేసి ప్రొటోకాల్ పేరుతో ఆసుపత్రి ప్రారంభోత్సవం కాకుండా అడ్డుకోలేదా? అని యడ్ల తాతాజీ నిలదీశారు.


యడ్ల తాతాజీ

ముగిసిన వేములదీవి వెంకన్న బ్రహ్మోత్సవాలు

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి వెస్ట్ పంచాయతీ కాపులకొడపలోఇన వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలో గురువారంతో ముగిశాయి. ఈ నెల 17న ప్రారంభమైన స్వామివారి కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని 19న కల్యాణ మహోత్సవం, సహస్రదీపాలంకరణ కార్యక్రమాలను అత్యంత వైభవంగా పూర్తి చేసుకుని గురువారం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పరిశర గ్రామాల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీసభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం స్వామివార్లకు శ్రీపుష్పయాగం, పర్యంకశయనోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయని నిర్వాహకులు తెలిపారు. ఆలయ ధర్మకర్త చెన్నాప్రగడ రూపచక్రధరరాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.


పూర్ణాహుతి ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పెనుగొండలో చండీహోమం

పెనుగొండ: పౌర్ణమి సందర్భంగా పెనుగొండలోని శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో గురువారం చండీహోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకుడు వడగం సత్యనారాయణమూర్తి బ్రహ్మత్వంలో చండీ హోమం నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ నూలి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గౌరీ దేవి పూజలు

నరసాపురం: పట్టణంలోని రాయిపేట ప్రసిద్ధ శ్రీపుంతలోముసలమ్మ ఆలయంలో గురువారం వైశాఖ పౌర్ణమి పురస్కరించుకుని గౌరీదేవి పూజలు ఘనంగా నిర్వహించారు. పూజ అనంతరం మహిళలు వాహనాలు ఒకరికొకరు అందించుకున్నారు. ఆలయ అర్చకుడు మంచిలి దుర్గాచంద్రశేఖరరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

వీరవాసరం: ప్రజా సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో విజయసారథి తెలిపారు. వీరవాసరం మండలంలో గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విజయసారథి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ, 90 రోజులు లోపు సర్వసభ్య సమావేశం నిర్వహించాలని కారణంతో కలెక్టర్ అనుమతితో సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వీరవల్లి దుర్గా భవాని, మండల స్థాయి అధికారులు, సర్పంచ్లు ,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొల్లు సెంట్రల్: విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం పట్టణంలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు నరసాపురం విద్యుత్ శాఖ ఈఈ బి సురేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పాలకొల్లు ఇండోర్ సబ్‌స్టేషన్ ప్రాంతంలో మరమ్మతులు చేసేందుకు ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నామని స్పష్టం చేశారు. అందువల్ల పట్టణంలో రాజీవ్‌నగర్, బెత్లహంపేట, లయన్స్ హాస్పిటల్,గవర్నమెంట్ హాస్పిటల్, రామారావు పేట, కొత్తపేట, పెద్దసాయిబాబా ఆలయ ప్రాంతం, వెలమగూడెం, కృష్ణభవానీ హస్పటల్, బీఆర్ఎంవి హైస్కూల్, లజపతి రాయ్‌పేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వివరించారు.

క్షీరారామలింగేశ్వరుని సన్నిధిలో చండీహోమం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో చండీహోమం నిర్వహించారు. గురువారం పౌర్ణమి సందర్భంగా ఆలయంలో చండీహోమం ఏర్పాటు చేశారు. ఈ హోమంలో 26 మంది దంపతులు పాల్గొన్నారు. హోమం అనంతరం భక్తులకు స్వామివారి శేష వస్త్రం, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో యాళ్ల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

ఉండి: ఈ నెల 4న నిర్వహించే ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు కట్టుదిట్టంగా, పక్కాగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సీవీ ప్రవీణ్‌ఆదిత్య అధికారులను ఆదేశించారు. భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కొరకు చేస్తున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ కట్టుదిట్టంగా జరగాలని ఎక్కడా ఎటువంటి సమస్యలు, ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ రోజున కేంద్రంలోపలికి వచ్చేవారిని నిశితంగా పరిశీలించి లోపలికి పంపాలన్నారు. ఐడీ కార్డుల చెకింగ్ రెండు దశల్లో ఉండాలని సూచించారు. అలాగే కౌటింగ్ ఏజెంట్లు, మీడియా ప్రతినిధులకు, అభ్యర్థులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే మీడియా వారి కోసం ప్రత్యేక రూంను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి వచ్చేవారికి మొబైల్‌ఫోన్‌లకు అనుమతి లేదన్నారు.లెక్కింపు కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో లెక్కింపు ప్రక్రియ జరిగేలా సిబ్బంది సమన్వయంతో పని చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఏఆర్‌ఓలు, ఎంపీడీవోలు, డిప్యూటీ తహసీల్దార్‌లు పాల్గొన్నారు.


నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ,నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ప్రవీణ్‌ఆదిత్య

వైభవంగా శ్రీమన్నారాయణుని గ్రామోత్సవం

పాలకొల్లు సెంట్రల్: శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం మూడో రోజు ఉదయం సుప్రభాతసేవ, సర్వదర్శనము, సహస్రనామ పూజలు, తీర్థగోష్టి, అలంకార తిరుమంజనం, సుందరకాండ పారాయణం, పూర్ణాహుతి, మంగళాశాసనం, సాయంత్రం ఆరాధన హోమాలు, దివ్య ప్రబంధ సేవాకాలము, ఊంజల్‌సేవ రాత్రి శేషవాహనంపై తిరువీధి ఉత్సవం చేశారు. స్వామి వారి అలంకరణకు రేపాక ప్రవీణ్ భాను కై ంకర్యం చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పీటీ గోవిందరావు, బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు మాజేటి రాంబాబు, నున్నకోటేశ్వరరావు, మాజేటి సూర్యభవాని, దేవత భాస్కరరావు, మామిడి బాబు, దాసరి నగేష్, రేపాక సుబ్బారావు, మాచేపల్లి పూర్ణ తదితరులు పాల్గొన్నారు.


శేషవాహనంపై స్వామి వారి తిరువీధి ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వైశాఖ మాస పౌర్ణమి ప్రత్యేక పూజలు

పెనుమంట్ర: వైశాఖ మాసం బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం పెనుమంట్రలో వేంచేసి యున్న శ్రీకనకదుర్గమ్మ అమ్మవారికి దేవస్థానం చైర్మన్ తమనంపూడి సాయినారాయణరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సన్నిధిరాజు బ్రదర్స్ ఆధ్వర్యంలో ఉదయం ఆలయం వద్ద అమ్మవారికి మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం గ్రామస్తులు సారె, చీర, సనివిడి పానకాలను మేళతాళాలతో కావిళ్లతో తెచ్చి అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమాలలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తేతలి సుధీర్‌రెడ్డి, యువజన విభాగం మండల అధ్యక్షుడు కొవ్వూరి నాగమోహన్‌రాజారెడ్డి, సత్తి చిరంజీవి రెడ్డి, నల్లమిల్లి రామిరెడ్డి, తేతలి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పెనుమంట్రలో శ్రీకనకదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఇసుక ర్యాంపుల పరిశీలన

పెనుగొండ: జిల్లాలో ఇసుక తవ్వకాలకు ఎక్కడా ఇప్పటి వరకూ అనుమతులు మంజూరు కాలేదని, అక్రమ తవ్వకాలు జరిపితే చర్యలు తప్పవని జిల్లా గనుల శాఖ అధికారి టి.జయప్రసాద్ హెచ్చరించారు. గురువారం పెనుగొండ మండలం సిద్ధాంతం, నడిపూడి, ఆచంట మండల కోడేరుల్లోని ఇసుక ర్యాంపులను ఆకస్మికంగా తనిఖీ చేవారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జిల్లాలో ఎక్కడా తవ్వకాలు జరపరాదని వివరించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఏడీ సునీల్ కుమార్, ఇరిగేషన్ డీఈఈ పవన్, పొల్యూషన్ బోర్డు ఈఈ కే వెంకటేశ్వర రావు, ఎస్ఈబీ అధికారి ఎం.శ్రీనివాస్, పెనుగొండ ఎస్సై షేక్ సుభానీ తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు వేయాలి

నరసాపురం: పట్టణంలోని స్టీమర్ రోడ్డు జంక్షన్ వైఎస్సార్ సెంటర్ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు వేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో ప్రతీ రోజూ ఏదో ప్రమాదాలు జరుగుతున్నాయి. అల్లూరి సత్యనారాయణరాజు మునిసిపల్ కాంప్లెక్స్‌కు ఎదురుగాఉన్న ఈ ప్రాంతం పట్టణంలో ప్రధాన సెంటర్‌గా ఉంటుంది. పట్టణంలో మొత్తం వ్యాపారమంతా దాదాపు ఇదే ప్రాంతంలో జరుగుతుంది. అయితే రద్దీగా ఉండే ఈ ప్రాంతం గుండా వాహనాలు మితిమీరిన వేగంతో వెళుతుండడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు నిర్మించే పరిస్థితి కాస్త మెరుగవుతుందని పట్టణ వాసులు కోరుతున్నారు.

అసాంఘిక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు

మొగల్తూరు: ఎన్నికల కౌంటింగ్ రోజున ఎవరైనా అసాంఘిక ఘటనలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నరసాపురం సీఐ కె.గోవిందరాజు హెచ్చరించారు. కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా జిల్లా ఎస్పీ అజిత ఆదేశాల మేరకు గురువారం మండంలోని రామన్నపాలెం గ్రామంలో నరసాపురం, మొగల్తూరు పోలీసులతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోని పలు ప్రాంతాలలో తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తులు గ్రామంలో సంచిరించినా, మద్యం, సారా అక్రమ నిల్వలున్నా, పెట్రోల్ మందుగుండు సామగ్రి నిల్వ చేసినా తమకు సమాచారం అందజేయాలని మొగల్తూరు ఎస్ఐ కె.వెంకటరమణ సూచించారు. గ్రామంలోని వాహనదారులు తమ వాహనాలకు సంబంధించి సరైన పత్రాలు ఉండాలని లేని పక్షంలోఅలాంటి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం

నరసాపురం: నరసాపురం గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరంలో గురువారం పిల్లలకు నీతి కథలు చెప్పారు. అలాగే పిల్లలతో అనుభవజ్ఞులైన తెలుగు అధ్యాపకులు పద్యాలు చదివించారు. తెలుగు టు ఇంగ్లీష్ ట్రాన్స్‌లేషన్, యోగా, చెస్ వంటి ఆటలు నేర్పించారు. ఈ వేసవి విజ్ఞాన తరగతులకు మంచి స్పందన వచ్చిందని, తరగతులు ముగింపు దశకు చేరుకున్నా కూడా ప్రతిరోజూ తరగతులకు వచ్చే వారి సంఖ్య పెరుగుతుందని లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి చెప్పారు.